బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి

● ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట : బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట, దమ్మన్నపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. వర్ధన్నపేటలో భవన నిర్మాణ కార్మికుల కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను, మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. దమ్మన్నపేటలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రైతులకు పలు పథకాలు అమలు చేయడంతో వారు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తమ వీధిలో ఎందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని దమ్మన్నపేట గ్రామస్తులు అరూరిని ప్రశ్నించారు. తమపై వివక్ష చూపుతున్నారన్నారు. ఆ వీధిలో ప్రతిపక్ష పార్టీ వారు ఉన్నందువల్ల రోడ్డు పనులు చేపట్టలేదని సర్పంచ్‌ను నిలదీశారు. ఇప్పటికైనా తమ వీధిలో


వర్ధన్నపేట: మీసేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో దమ్మన్నపేట సర్పంచ్ అర్జుల మంగ తిరుపతిరెడ్డి, వర్ధన్నపేట మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

పర్వతగిరి : మండల పరిధిలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రమేష్ అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ అభివృద్ధి పనులపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడొద్దని, అభివృద్ధి పనులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమీక్షలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, జెడ్పీటీసీ సింగ్‌లాల్, రంగు కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

● ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఎలాంటి ఉపయోగం లేని బడ్జెట్ అన్నారు. ఇరిగేషన్‌లో సరైన కేటాయింపులు లేవని తెలిపారు. మార్కెట్ నైపుణ్యం కోసం పెట్టే పెట్టుబడులు, స్టోరేజ్ విషయంలో వ్యూహాత్మకంగా కేటాయింపులు తగ్గిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. దీని వెనుక కుట్ర కోణం దాగి ఉందని అభిప్రాయపడ్డారు. రైతులకు వచ్చే సబ్సిడీలను క్రమంగా ఎత్తివేసేలా కేంద్రం చర్యలు తీసుకుంటుందని, అందుకు ఈ బడ్జెట్ ఉదాహరణ అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు సబ్సిడీ కేటాయింపులు తగ్గిస్తూ వస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే ఈ బడ్జెట్ అన్నారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. పేదల నడ్డి విరిచే విధంగా బడ్జెట్ ఉందని, పేదలకు అందే సబ్సిడీలు, గ్యాస్ సబ్సిడీలు ఎత్తివేసిందన్నారు.

రైతులు ఆందోళనకు గురికావొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట నియోజకవర్గంలోని రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు త్వరలో 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏకకాలంలో రైతులు వరినాట్లు వేయడం వల్ల విద్యుత్‌కు డిమాండ్ పెరిగి అంతరాయం ఏర్పడుతోందన్నారు. విద్యుత్ సరఫరాలో ఉన్న లోపాలను గుర్తించి గత వారం రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ సిబ్బందితో పనులు చేయించడం జరుగుతుందని తెలిపారు. 1.5కిలో మీటర్ల పొడవు గల నూతన 11కేవీ విద్యుత్ లైన్ సరి చేయడం, నూతనంగా తొమ్మిది(63)కేవీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నాలుగు (25కేవీ) డీటీఆర్‌ల ఏర్పాటు, 534 స్తంభాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్ అందించాలని కన్‌స్ట్రక్షన్ డీఈ హర్షి, డీఈ సదానందం, విద్యుత్ సిబ్బందికి సూచించారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీ కాల్వకు గండి



పర్వతగిరి : మండలంలోని హట్యాతండా గ్రామపంచాయతీ శివారులో పల్లె ప్రకృతి వనం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాల్వకు బుధవారం గండి పడింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంస్కృతిని కాపాడుకుందాం



చెన్నారావుపేట : అంతరించిపోతున్న గోర్ బంజారా సంస్కృతిని కాపాడుకుందామని కామారెడ్డి జిల్లా గోర్ సిక్వాడీ అధ్యక్షుడు శివరాం జాదవ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని జీడిగడ్డతండాలో ధరావత్ మురళినాయక్-లావుడ్య భానుప్రియకు బుధవారం గోర్ బంజారా సంస్కృతీ, సంప్రదాయల ప్రకారం వివాహం నిర్వహించారు. ఈ సందర్భంగా గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ కిషన్ మాట్లాడారు. భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాండునాయక్, కిషన్, భోజ్యా నాయక్, లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



సంగెం : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన పోశాల రమేష్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కౌండిన్య పరపతి సంఘం సభ్యులు రూ.10వేల సాయాన్ని బుధవారం అందజేశారు. వీరస్వామి, ఉమేందర్, శరత్, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలు తగదు

నెక్కొండ /చెన్నారావుపేట : వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ప్రజా ప్రస్థాన పాదయాత్రలో వ్యక్తిగత దూషణలకు తావివొద్దని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లో నిర్వహించనున్న షర్మిల పాదయాత్రలో పార్టీలు, కులాలు, మతాలు, వ్యక్తిగతంగా ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. హైకోర్టు, పోలీసు ఉన్నతాధికారుల షరతులకు లోబడి పాదయాత్ర చేయాలని పేర్కొన్నారు.

జీపీ ట్రాక్టర్ పరికరాల అపహరణ

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేట గ్రామపంచాయతీ ట్రాక్టర్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోతున్నారు. గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను పంచాయతీ ఆవరణలో రాత్రి సమయంలో నిలుపుతున్నారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు చెందిన పరికరాలను అపహరించుకుపోతున్నారు. కొద్ది రోజుల క్రితం హైడ్రాలిక్ పైపులు అపహరించుకుపోయారు. దీంతో చేసేదేమి లేక అధికారులు, పాలకవర్గ సభ్యులు నూతన పరికరాలను కొనుగోలు చేసి అమర్చారు. మంగళవారం మరోసారి హైడ్రాలిక్ అడ్జస్ట్ పట్టీలతో పాటు హైడ్రాలిక్ పైపు అపహరించుకుపోయారు. ఇటీవల పల్లె ప్రకృతి వనం చుట్టూ ఏర్పాటు చేసిన పోల్స్‌ను విరగగొట్టి పడేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు జీపీ అధికారులు తెలిపారు.

డీసీసీబీ మాజీ డైరెక్టర్ సాంబరెడ్డి మృతి



నర్సంపేట : నర్సంపేటకు చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాధారాపు సాంబరెడ్డి (74) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. చెన్నారావుపేట సొసైటీ చైర్మన్‌గా, వరంగల్ డీసీసీబీ డైరెక్టర్‌గా, ఇఫ్కో రాష్ట్ర డైరెక్టర్‌గా కొనసాగుతున్న సాంబరెడ్డికి గుండెపోటు రావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాంబరెడ్డి మరణంతో నర్సంపేట నియోజకర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములుతో పాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

యువత క్రీడల్లో రాణించాలి



పర్వతగిరి : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని సర్పంచ్ పంజా మహేష్, ఉపసర్పంచ్ సూర అశోక్, ఎంపీటీసీ సూర రమేష్ అన్నారు. మండలంలోని గోపనపల్లిలో యువతకు క్రికెట్ బ్యాట్‌లు, టీషర్ట్స్ బుధవారం అందజేశారు.

హామీలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

నర్సంపేట : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజలను మభ్యపెట్టే విధంగా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నేతి బీరకాయ చందంగా ఉందని అన్నారు. గత బడ్జెట్ వలె ఈ బడ్జెట్‌లో కూడా కొత్త దనం ఏమి లేదని, కొత్త పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునే కార్యక్రమం తప్ప పేద,మధ్య తరగతి ప్రజల సంక్షేమం కానరావడం లేదన్నారు. పెరిగిన ధరల భారంతో కనీస అవసరాలు తీర్చుకోలేక పేదలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గత హామీలను విస్మరించి పేరుకు మాత్రమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు కనబడుతోందన్నారు. రైతు ఆత్మహత్య నివారణకు కనీస


సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

పంటల మద్దతు ధర చట్టం ఊసెత్తకపోవడం విదేశీ వ్యవసాయాన్ని దివాళా తీయించి కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. అలాగే కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలను అమలు చేస్తామని ఎన్నికల వాగ్దానం చేసి ఇప్పుడు కాలయాపన చేస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. బీజేపీ నాయకులు వారి ప్రభుత్వాన్ని ఒప్పించి విభజన హామీలకు నిధులు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'పాస్టర్‌ది ఆత్మహత్య కాదు'

నెక్కొండ : తన భర్త గుల్లి తిమోతీ(నెక్కొండ సీఎస్ఐ చర్చి పాస్టర్)ది ఆత్మహత్య కాదని, మృతిపై అనుమాన స్పదంగా ఉందని మృతుడి భార్య మరియమ్మ తెలిపారు. చర్చి ఆవరణలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత నెల 13న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని భర్త మృతి చెందాడని ముందుగా భావించామన్నారు. భర్తను కోల్పోయిన దుఃఖంలో ఉండగా కొందరు వ్యక్తులు తన చేత ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయించారని ఆమె కన్నీరుమున్నీరయ్యారు. పాస్టర్ ఆత్మహత్యకు పాల్పడలేదని, గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉరి వేసుకున్నట్లు లుంగీతో ఇంట్లో దూలానికి వేలాడదీశారని ఆమె ఆరోపించారు. తిమోతీ ఛాతి మీద గాయాలున్నాయని, ఉరి వేసుకున్నట్లు ఎలాంటి ఆనవాళ్లు లేక పోవడంతోనే పలు అనుమానాలు ఉన్నాయన్నారు. తన భర్త ఆత్మహత్యకు పాల్పడే పిరికి వాడు కాదన్నారు. మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. తన భర్త మృతికి కారణమైన వారిపై విచారణ చేసి న్యాయం చేయాలని ఆమె కోరారు.

రైతులు పంటల నమోదు చేసుకోవాలి

● ఏడీఏ అవినాష్‌వర్మ

ఖానాపురం : రైతులు తాము సాగు చేస్తున్న పంటల నమోదును తప్పకుండా చేసుకోవాలని నర్సంపేట ఏడీఏ అవినాష్‌వర్మ సూచించారు. ఈ మేరకు మండలంలోని కొత్తూరులో పంటల నమోదు, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నమోదు వల్ల రైతులకు లాభం చేకూరుతుందన్నారు. మిరప పంటల్లో పై ముడత, నల్ల తామర ఆశిస్తోందని, నివారణకు ఎకరంలో 40చొప్పున నీలి రంగు, పసుపు, తెలుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పది రోజులకు ఒకసారి రసం పీల్చు పురుగుల నివారణకు వేపనూనె 5ఎంఎల్, అసిఫేట్ 2గ్రాములు, మోనోక్రోటోఫాస్ 2.5మి.లీ, ఇమిడాట్ క్లోప్రిడ్ 0.4మి.లీ, అసిటమప్రిడ్ 0.4గ్రాములలో ఏదో ఒకటి ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పూత, కాయ, పిందె రాలకుండా బోరాన్ 5గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏఈఓలు నూకల సంతోష్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ అవినాష్‌వర్మ

'దళిత బంధు'లో రాజకీయం వద్దు

గీసుకొండ: దళిత బంధు పథకంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చాలని, మాదిగ ఉప కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మార్పీఎస్(టీఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాసి మోహన్, జిల్లా అధ్యక్షుడు నమిండ్ల చిన్నస్వామి డిమాండ్ చేశారు. బుధవారం గీసుకొండ మండల కేంద్రంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్సీల్లో అర్హులైన నిరుపేదలకు దళిత బంధు అందాలని ఈ నెల 3న తమ సంఘం జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపెల్లి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సంఘం జిల్లా అధికార ప్రతినిధి కొమ్ముల భిక్షపతి, ఉపాధ్యక్షులు చింత జోసెఫ్, జిల్లా ప్రచార కార్యదర్శి కొంగర స్వామి, నాయకులు ఎర్రోళ్ల సుదర్శన్, నమిండ్ల హరీష్, ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు. ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా నాయకులు ఆవిష్కరించారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కేటాయించాలి

నర్సంపేట: కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్రానికి న్యాయమైన వాటా కేటాయించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రషెకావత్, కేంద్ర డిప్యూటీ హోంశాఖ మంత్రి నిత్యానందరాయ్‌లను బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా రాకుండా ఆంధ్ర నాయకులు ఎక్కువ నీటిని వాడుకున్నారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. జన సమితి నాయకులు అంబటి శ్రీనివాస్, ఆశప్ప, శ్రీధర్ ఉన్నారు.

'బీసీ-ఏలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నాం'

నర్సంపేట : తెలంగాణ బీసీ కమిషన్ 26 ఆంధ్ర కులాలు, ముదిరాజ్‌లను బీసీ-ఏ లో చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బయ్యా సాంబమూర్తి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఓ కళాశాలలో డివిజన్ అధ్యక్షుడు సాంబరాతి మల్లేశం అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ఆంధ్ర కులాలను బీసీ-ఏలో చేరిస్తే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. గడప కోటేశ్వర్, కొల్లూరి లక్ష్మినారాయణ, కొల్లూరి కట్టయ్య, శ్రీనివాస్, జీజుల సాగర్, మేదర బోయిన రాంకిశోర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాంబమూర్తి

సంక్షిప్త సమాచారం

అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో గల ప్రభుత్వ భూమిలో అక్రమ మొరం తవ్వకాలను నిలిపివేయాలని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు తొర్రి పద్మ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కోమికి బుధవారం వినతిపత్రం అందజేశారు.

తుమ్మ చెట్లను నరికివేయడం సరికాదు

చెన్నారావుపేట : గొర్రెలు, మేకల మేతకోసం ఉపయోగపడే తుమ్మ చెట్లను నరికివేయడం సరికాదని గొర్రెల, మేకల పెంపకందారుల జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి నల్లకుంట చెరువుకట్టపై నరికివేసిన తుమ్మ చెట్లను బుధవారం గొల్ల, కురుమలతో కలిసి మధుకర్ పరిశీలించారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

వర్ధన్నపేట : మండలంలోని రామోజీ కుమ్మరిగూడెంలో ఎస్సారెస్పీ కెనాల్ వెంట ఉన్న భూముల్లో రైతులు గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు.

'చల్లా'ను కలిసిన మార్కెట్ డైరెక్టర్లు

గీసుకొండ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా బుధవారం పరకాల నియోజక వర్గానికి చెందిన మార్కెట్ డైరెక్టర్లు గోలి రాజయ్య(16వ డివిజన్ ధర్మారం), పసునూరి సారంగపాణి(సంగెం), తుమ్మ రవీందర్‌రెడ్డి(బొల్లికుంట)లు తమ పదవీ కాలాన్ని కొనసాగించినందుకు ఎమ్మెల్యే ధర్మారెడ్డిని, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లును హనుమకొండ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు మనీషా, బాబు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఖానాపురం: మండలంలోని ధర్మారావుపేటలో వెలమ సంక్షేమ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గ్రామ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెపాటి సంపత్‌రావు, ఉపాధ్యక్షుడిగా కొలుగూరి రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కత్తాల సంపత్‌రావు ఎన్నికయ్యారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీ

రాయపర్తి : మండలకేంద్రంలోని అంగడి ప్రాంతంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు బల్లెం యాదగిరి తెలిపారు. అధ్యక్షుడిగా ఐత శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా సుబ్బారావు, ప్రధానకార్యదర్శిగా యాదగిరి ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎన్నిక

గీసుకొండ: జిల్లా ఆర్‌ఎంపీలు, పీఎంపీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వంచనగిరి గ్రామానికి చెందిన బూర్గుల రాజేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బండి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా పసునూటి రమేశ్, ఉపాధ్యక్షులుగా ఏదాకుల రాజిరెడ్డి, సహాయ కార్యదర్శిగా సదానందం ఎన్నికైనట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు.

యూనుస్‌కు కేఎంపీఎల్ అవార్డు

నర్సంపేట : విధి నిర్వహణలో ఇంధనం పొదుపులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ ఎండి.యూనుస్ 2022–23సంవత్సరపు కేఎంపీఎల్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు బుధవారం డిపో మేనేజర్ విజయమాధురి చేతుల మీదుగా యూనుస్‌తో పాటు పీవీ రావు అందుకున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సంగెం : మండలంలోని కుంటపల్లిలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ దూడయ్య పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

రాయపర్తి : మండల పరిషత్ కార్యాలయంలో మొరిపిరాల, కొత్తూరు, గట్టికల్, ఆరెగూడెం, జయరాంతండా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ పంపిణీ చేశారు.

రైతులకు హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలి



ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట పరిధిలోని రైతులకు హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ గోపికి బుధవారం వినతిపత్రం అందజేసి వివరాలు తెలియజేశారు.

అరెస్ట్ అప్రజాస్వామికం

నల్లబెల్లి : హనుమకొండలోని అంబేడ్కర్ కాలనీలో మాజీ కలెక్టర్ ఆకునూరి మురళిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కొర్నేల్, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీపగడాల వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవంలో భాగంగా బుధవారం పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్, ఆలయ నిర్మాణకర్త మాద్రాజు వెంకన్నరేణుక దంపతుల ఆధ్వర్యంలో పంచలోహ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ఊరేగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం నిర్వహించే కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బలుగూరి విజాకర్‌రావు, కత్తాల వెంకటేశ్వర్‌రావు, వెన్ను సమ్మయ్యఅండమ్మ, పోతరాజు కర్ణాకర్‌కవిత, లింగబత్తుల యాకస్వామి, జూకూరి మల్లికార్జున్, పురోహితులు అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష పుష్పాలంకరణ



నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేట గ్రామంలోని శ్రీద్వారకా వేణుగోపాల వేంకటేశ్వరస్వామికి భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం లక్ష పుష్పాలంకరణ నిర్వహించారు. ఆలయ చైర్మన్ కమిటీ బృందం నంద్యాల వీరారెడ్డి, అర్చకులు ఆరుట్ల వెంకటాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు, దాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవం



నల్లబెల్లి : మండల కేంద్రంలో నిర్మించిన సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల విగ్రహాలు(గద్దెలు) ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు వేదపండితులు గణపతి హోమం, రుద్రయాగం, విగ్రహాలకు జలాధివాసము, మంత్రపుష్పము ప్రత్యేక పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నేడు (గురువారం) అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ప్రవీణ్ కుమార్, సర్పంచ్ నానెబోయిన రాజారాం, భక్తులు పాల్గొన్నారు.

రాజగోపుర ద్వారం ఏర్పాటు



గీసుకొండ : మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద రాజగోపుర నిర్మాణం పనుల్లో భాగంగా బుధవారం గోపురం ద్వార తలుపుల ఏర్పాటు పనులను చేపట్టారు. దాతల సహకారాలతో రూ.8లక్షలతో రెండు తలుపులపై చెక్కించిన నవ నారసింహులు, దశావతారాల రూపాలు దైవత్వం ఉట్టిపడేలా ఉన్నాయి. దాతలు కొనె వెంకటగిరి, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, ఈఓ శేషగిరి, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వీరాటి రవీందర్‌రెడ్డి , సర్పంచ్ అంకతి నాగేశ్వర్‌రావు, బాలరాజు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామాచారి, విష్ణు, ఫణి, దాతలతో పాటు భూషణం, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన పైండ్ల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ బుధవారం రాములు కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు పుట్ట తిరుపతి, జక్కి శ్రీకాంత్, గుంటి కుమారస్వామి, కర్ర మాలతిరెడ్డి, కర్ర శ్రీనివాసరెడ్డి, తాళ్లపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

నెక్కొండ : బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ రామారపు పుండరీకం మృతి తీరని విషాదాన్ని మిగిల్చిందని, బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న అన్నారు. మండల కేంద్రంలో పుండరీకం ప్రథమ వర్ధంతిలో ఆమె పాల్గొని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం రూ. 53వేల ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య శోభారాణికి అందించారు. సంగని సూరయ్య, కొణిజేటి భిక్షపతి, మారం రాము, కొమ్ము రమేష్‌యాదవ్, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నెక్కొండ: నివాళులర్పిస్తున్న పెద్ది స్వప్న

దేశానికి సేవ చేయడం గొప్ప అనుభూతి

నర్సంపేట : దేశానికి సేవ చేయడం మరచిపోలేని ఓ అనుభూతి అని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని అన్నారు. ఈ మేరకు నర్సంపేటలోని నెహ్రూనగర్‌కు చెందిన వేల్పుల శ్రీధర్ ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందారు. అనంతరం నర్సంపేటకు చేరుకోగా శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో దేవాలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో బుధవారం ఘనస్వాగతం పలికారు. నెహ్రూనగర్‌లోని ఇంటి వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి విద్యార్థులచే పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గందె సుజాతచంద్రమౌళి, మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, ముత్యాల వీరస్వామి, వేల్పుల భాస్కర్, రాజేందర్, లక్ష్మణ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీధర్‌ను సత్కరిస్తున్న బాధ్యులు